

చిత్రకవితా పరిశోధనలో రారాజు 'రమణరాజు'

కడప అర్బన్ : చిత్రకవితా పరిశోధనలో రారాజు అలంకారం వేంకట రమణరాజని, ఆయన చిత్రకవిత్వాన్ని లోతుగా అధ్యయనం చేసి వెలువరించిన గొప్ప గ్రంథం 'చిత్రకవితా సౌరభం' అని 'చిత్రకవితా సమ్రాట్' చింతా రామకృష్ణారావు అన్నారు. అలంకారం వేంకట రమణరాజు పరిశోధించి రచించిన 'చిత్రకవితా సౌరభం' పుస్తకావిష్కరణ సభ ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో చిత్ర సాహితీ ప్రచురణలు నిర్వహించారు. ముఖ్యఅతిథులు పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రకవిత్వంలో పరిశోధనలు చాలా తక్కువగా వచ్చాయని, మండపాక పార్వతీశ్వరకవి రచించిన పుస్తకం మినహాయిస్తే ఆ స్థాయిలో విలువైన గ్రంథం వెలువడలేదని పేర్కొన్నారు. కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్ డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ కవిత్వం ఆలోచనామృతమని, అందులోనూ చిత్రకవిత్వం మరింత లోతుగా అధ్యయనం చేస్తేనే కానీ అర్థం కాదన్నారు.

మోగిన బడిగంట

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

విద్యా కానుక పంపిణీకి రంగం సిద్ధం

ఈనెల 17 వరకు ఒంటిపూట బడులు

ప్రజాశక్తి - కడప అర్బన్

వేసవి సెలవులు అనంతరం సోమవారం పాఠశాలల బడిగంటలు మోగనున్నాయి.. సెలవుల్లో ఆటలు, పాటలు, విహార యాత్రలకు వెళ్లిన విద్యార్థులు పాఠశాలలకు పరుగులు పెట్టనున్నారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1,849, ప్రాథమికోన్నత పాఠశాలలు 397, ఉన్నత పాఠశాలలు 620 ఉన్నాయి. ఈ పాఠశాలలో 3,18, 077 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల చేరిన రోజే విద్యార్థులకు విద్యాకానుక పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసు కున్నారు. విద్యార్థుల వేలి ముద్రలు తీసుకుని విద్యాకానుక పంపిణీ చేస్తారు. 2,094 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో ఉన్న 1,58,156 మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్స్ అందజేస్తారు. కిట్‌లో మూడు జతల యూనిఫాం, రెండు జతల సాక్సులు, ఒకజత బూట్లు, బెల్టు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీ ఉంటాయి. మరో వైపు నాడు-నేడు రెండో విడత పనులు కొన్ని పాఠశాల్లో పూర్తి కాకపోవడంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది.

ఒంటిపూట బడి : ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండడంతో ప్రభుత్వం విద్యార్థులు క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఒంటిపూట బడి వారం రోజులు పాటు కొనసాగించాలని నిర్ణయించారు. ఈ నెల 12 నుంచి 17 వరకు ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు పాఠశాల సమయం ఉండాలే చర్యలు తీసుకున్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాట : కలెక్టర్

వేసవి సెలవుల తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు ఈనెల 12 నుంచి తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా 2094 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో 1,58,156 మంది విద్యార్థులకు రూ.40 కోట్ల నిధులతో జగనన్న విద్యా కానుకను అందిస్తున్నట్లు కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. ఆదివారం విద్యా కానుక యూనిఫామ్ ను పరిశీలించారు. మూడు జతల యూనిఫాం,రెండు జతల సాక్సులు,ఒక జత షూ, బ్యాగు, బెల్టు, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ , డిక్షనరీ అందిస్తామని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి చెప్పారు. విద్యా కానుకల విద్యార్థులందరికీ మొదటిరోజు పంపిణీ చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ అధికారి డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



యూనిఫాం పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

విద్యాకానుక పంపిణీకి కసరత్తు

పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు

229 రోజుల విద్యా ప్రణాళిక ఖరారు

జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నేటి నుంచి 2023-24 అకడమిక్ ఇయర్ అమలవుతోంది. ఈమేరకు జిల్లాలోని 2,250 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేయడమైంది. ఇందులోభాగంగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను సజావుగా పూర్తి చేయడమైంది. విద్యా సంవత్సరం ప్రారంభించిన రోజు నుంచి జిల్లాలోని 1,57,743 మంది విద్యా ర్థులకు సుమారు తొమ్మిది రకాల విద్యా సామగ్రిని అందజేయడం జరుగుతుంది. నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి 229 రోజుల పాఠశాలల పని దినాల ప్రణాళికను రూపొందించడమైందని పేర్కొంటున్న జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి..

నూతన విద్యా సంవత్సర ప్రణాళిక గురించి తెలపండి?

2023-24 అకడమిక్ ఇయర్‌లో 317 రోజుల పని దినాలను గుర్తించడమైంది. ఇందులో సాంస్కృతిక ఉత్సవాలను, పర్వ దినాలను, ప్రభుత్వ సెలవులను మినహాయించి 229 పనిదినాలతో కూడిన విద్యా సంవత్సర పనిదినాల ప్రణాళికను రూపొందించడమైంది.

ఒంటిపూట బడులు అంటున్నారేమిటి?

జూన్ రెండవ వారంలోనూ వేడిమి వాతావరణం కొనసాగుతున్న నేపథ్యంలో నేటి నుంచి 17వ తేదీ వరకు మార్నింగ్ స్కూల్స్ నిర్వహణకు ఆదేశాలొచ్చాయి. ఈమేరకు ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పాఠశాలలను నిర్వహించాలని ఆదే శాలు జారీ చేశాం.

విద్యాకానుక పంపిణీ గురించి తెలపండి?

జిల్లాలో రూ.39 కోట్ల వ్యయంతో కూడిన తొమ్మిది రకాల విద్యాకానుకను పంపిణీ చేయడం జరుగుతుంది. పాఠశాలలు ప్రా రంభించే మొదటి రోజు నుంచి 1,57,743 మంది ప్రభుత్వ పాఠ శాలలకు చెందిన విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుంది. ఇందులోభాగంగా కడప నగరంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశా లలో కలెక్టర్ అధ్యక్షతన ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా చేతుల మీ దుగా పంపిణీ చేయనున్నాం.

బదిలీల ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుంది?

జిల్లాలో సుమారు 3,500 మంది ఉపాధ్యాయులు బదిలీల ప్రక్రియను పూర్తి చేశాం. రెండ్రోజుల కిందట ఎస్‌జిటిలు, స్కూల్ అసిస్టెంట్లు, ఆదివారం పిఇటిలు, ఎల్‌పిల బదిలీల ప్రక్రియను పూర్తి చేయడం జరిగింది.

ఆప్షన్ ఎంపికలో తడబడిన వారి పరిస్థితి ఏమిటి?

ఆన్‌లైన్ ఆప్షన్‌లో తడబడిన వారికి సంబంధించి గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. కంపల్సరీ, రిక్వెస్ట్ ఆప్షన్ స్పష్టంగా ఉంది. ఎంపిక చేసుకున్న తర్వాత సరిచూసుకొని ఉండాలి. రీచెక్ చేసుకోని నేపథ్య ంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇటువంటి వారందరికీ ముందుగా బదిలీ ప్రాంతానికి వెళ్లి విధుల్లో చేరాల్సి ఉంది. అనంత రం గైడ్‌లైన్స్ వచ్చిన అనంతరం మార్పు, చేర్పులకు అవకాశం ఉం టే పరిశీలిస్తాం.

పాఠ్యపుస్తకాల లభ్యత ఎలా ఉంది?

జిల్లాలోని ప్రభుత్వపాఠశాలల పరిధిలోని 1,57,743 లక్షల మంది విద్యార్థులకు సంబంధించి 20,73,872 పాఠ్యపుస్తకాలకు ఇండెంట్ పెట్టాం. ఈమేరకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలను అంద జేస్తాం.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

బలవంతపు భూసేకరణ ఆపాలి

- కరపత్రాల ఆవిష్కరణలో ఏపీ రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే రోడ్డు అభివృద్ధి అనే ముద్దు పేరుతో రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వకుండా బలవంతంగా భూ ములు తీసుకుంటున్నారని తక్షణమే ఆపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బలవంతపు భూసేకరణపై కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే కోసం సేకరిస్తున్న భూములు పులివెందల ఎర్రగుంట్ల కమలాపురం చాపాడు మైదుకూరు బి.మఠం ప్రాంతాలలో చాలా విలువైన భూములని ఎకరా కోటి రూపాయలు పైగా ఉన్నాయని, రెండు, మూడు పంటలు పండుతాయని, అటువంటి వాటికి ఎకరానికి రూ.10 నుంచి రూ.15 లక్షల మాత్రమే ఇస్తామనడం దారుణమన్నారు. నోటీసులు ఇవ్వకుండా, గ్రామ సభలు పెట్టకుండా రైతులు వ్యతిరేకించినా భూములలో బలవంతంగా సర్వే చేస్తూ నంబర్ రాళ్లు పాతుతున్నారని తెలిపారు. 2023 మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పూర్తిగా భూమి కోల్పోతున్న రైతులకు నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ భూమి కేటాయించాలని రోడ్డుతో నష్టపోతున్న ఇళ్లకు 2023 రేట్ల ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. గ్రామకంఠంలో ఉన్న ఇంటికి స్థలానికి సెంటుకు రూ. 3 లక్షలు చెల్లించాలని పేర్కొన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపోతున్న భూములకు, ఇళ్లకు నష్టపరిహారం మూడు రెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ సభలలో బలవంతపు భూసేకరణ పై రైతులు వ్యతిరేకించాలని అధికారులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పుత్తా నరసింహారెడ్డితోనే కమలాపురం అభివృద్ధి

ప్రజాశక్తి - కడప అర్బన్

పుత్తా నరసింహారెడ్డితోనే కమలాపురం అభివృద్ధి సాధ్యమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ అన్నారు. ఆదివారం పాత బస్టాండ్‌లోని మన్నూరు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురంలో చంద్రబాబు ప్రజా మేనిఫెస్టో ప్రజలకు వివరిస్తామని, పుత్తా నరసింహా రెడ్డి ని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ద్వారా మహిళలకు న్యాయం, గౌరవం లభి స్తుందని తెలిపారు. కమలాపురం నియోజకవర్గం ప్రజలకు టిడిపి భవిష్యత్తు విధి విధానాలు వివరించి, గతంలో పుత్తా నరసింహా రెడ్డి చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలు గుర్తు చేస్తూ ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. రాయలసీమ నియోజకవర్గాల్లో కమలాపురం వెనుక బడిన నియోజకవర్గం, అట్టి ప్రాంతానికి పుత్తాను ఎమ్మెల్యే చేస్తే అభివృద్ధి వేగం అందుకుంటుందన్నారు. సమావేశంలో నాయకులు నాదిండ్ల దస్తగిరి, రూపన గుడి హుస్సేన్, ఖాదర్ సాబ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

చెస్ టోర్నీ విజేత మహీధర్

ప్రజాశక్తి - కడప

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని మస్తాన్‌వల్లి వీధిలో చెస్ ఆఫ్ హాల్‌లో నిర్వహించిన 17వ అష్రఫ్- ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంట్ విజేతగా పోరుమామిళ్లకు చెందిన మహీధర్ నిలిచాడు. రన్నర్‌అప్‌గా గోపాయపల్లెకు చెందిన సీనియర్ మహిళా క్రీడాకారిణి ఉమాదేవి నిలిచింది. ఈ టోర్నమెంట్లో జిల్లా నలుమూలల నుంచి 44 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఐదు రౌండ్ల పాటు స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహించిన టోర్నమెంట్ లో 5 రౌండ్లకు గాను 5 పాయింట్లు సాధించి పోరుమామిళ్ళకు చెందిన మహీధర్ విజేతగా నిలిచినాడు. బహుమతులను చెస్ అసోసియేషన్ సెక్రటరీ అనీష్ దర్బారి, కోచ్ తబస్సుమ్ అందజేశారు.

బహుమతులు అందజేస్తున్న అతిథులు

వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరు అరెస్టు

కడప అర్బన్ : నిద్రిస్తున్న వృద్ధురాలను గొంతు కోసి హత్య చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీ చేసిన 34 గ్రాముల బంగారు గాజులు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి మహమ్మద్ షరీఫ్ తెలిపారు. ఆదివారం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నెలల కిందట పెండ్లిమర్రి మండలం ఎగువపల్లిలో నివాసం ఉంటున్న దాదిరెడ్డి ఓబులమ్మ (82) అనే వృద్ధురాలిని హత్య చేసిన కేసులో పెండ్లిమర్రి మండలం యాదవ పురం చెందిన యాకసిరి రవీంద్ర, కమలాపురం మండలం నేటపల్లి గ్రామం చెందిన యాకసిరి వీర నాగరాజును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన రూరల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి, పెండ్లిమర్రి ఎస్‌ఐ డి.సునీల్ కుమార్ రెడ్డిని డిఎస్‌పి అభినందించారు.

వైసిపికి ఇచ్చిన సీట్లు మాకిస్తే

'సీమ'ను అభివృద్ధి చేసి చూపిస్తాం

ఇసుకాసురుల దెబ్బకు పెన్నానది విలవిల

అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

బద్వేల్ నియోజకవర్గంలో సాగునీటి కష్టాలు తీరుస్తాం

వైసిపి రౌడీ మూకలను ఉక్కుపాదంతో అణిచివేస్తాం

పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-బద్వేల్/ అట్లూరు

రాయలసీమ వాసులు జగన్‌కు 49 మంది ఎమ్మెల్యేలను గెలిపించి ఇస్తే వారు సీమకు చేసిందేమిటని, రాబోవు ఎన్నికల్లో వైసిపికి ఇచ్చిన సీట్లు తమకు ఇస్తే రాయ లసీమను అభివృద్ధి చేసి చూపిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. జగన్ పాలనలో రైతులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వాటి ధరలూ విఫరీరంగా పెరిగిపోయాయని తెలిపా రు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 123 రోజుకు చేరుకుంది. ఆదివారం కడప జిల్లా బద్వేలు నియో జకవర్గంలోని నదియాబాద్ విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర సోమే శ్వరపురం, ఎర్రబల్లె, అప్పరాజుపేట, రాజుపాలెం, వెంకటశెట్టిపల్లి, కొంగలవీడు, శివరాంనగర్, శంకరాపురం క్రాస్, చింతల చెరువు క్రాస్, బయ్యనపల్లి, అబ్బూ సాహెబ్, బద్వేలు శివారు విద్యానగర్ విడిది కేంద్రం వరకూ సాగింది. ఆయా ప్రాంతాల్లో రైతులు, స్థానికులు, విద్యార్థులతో ముఖాముఖి, సమావేశాలు, మాటామంతీ వంటి కార్యక్ర మాలు నిర్వహిఁచారు. ఆయా ప్రాంతాల్లో లోకేష్ మాట్లాడుతూ సీమ రైతులకు నీరిస్తే బంగారం పండిస్తారని చెప్పారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో డ్రిప్‌పై సబ్సిడీని ఎత్తేసి రైతులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పాత డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని తీసుకొస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ. 11,700 కోట్లు ఖర్చు చేశారని, అందులో వైసిపి ప్రభుత్వం పది శాతం కూడా వ్యయం చేయలేదని వాపోయారు. అధికారంలోకి వచ్చిన వెంటను భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో అన్నదాతకు రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామని పేర్కొన్నారు. టిడిపి హయంలోనే పులివెందులకు నీళ్ల ఇచ్చారన్నారు. జగన్ పాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. రైతుల ఆత్మహత్యల్లో ఎపి దేశంలోనే నంబర్ 3 స్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో నంబర్ 2గా ఉందని చెప్పారు. గోదావరి, కృష్ణా, పెన్నా అనుసంధానం ద్వారానే సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ముంపుకు గురై భూములు కోల్పో యిన రైతులను ఆదు కుంటామన్నారు. బద్వేల్‌లో టిడిపి జెండా ఎగురవేస్తే పెండింగ్ ప్రాజెక్టులు, బ్రిడ్జి పనులు పూర్తి చేసే బాధ్యత తనదని తెలిపారు. బద్వేల్ నియో జకవర్గంలో సాగునీటి కష్టాలు తీర్చడానికి పిల్లకాలువ తవ్వుతామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాయలసీమలో హార్టి కల్చర్‌ని ఎక్కువుగా ప్రోత్సహిస్తామని చెప్పారు. వాతావరణ పరిస్థి తులకు అనుగు ణంగా ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తాం. జూస్ ఫ్యాక్టరీలు రావడానికి కావాల్సిన రకాలు పెంచే విధంగా చర్యలు తీసుకుం టామన్నారు. పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం, సెరీ కల్చర్ ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామని తెలిపారు. సోమశిల ముంపు బాధితులకు టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని, మొదటి 18 నెలల్లో పరిహారం అంది స్తామని తెలిపారు. బద్వేల్ నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే అదనంగా మరో 80 వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉందని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

లింగాలకుంట వద్ద పెన్నానది ఇసుక కోసం వెళ్తున్న టిప్పర్ లారీని సెల్ఫీ ద్వారా చూపుతున్న నారా లోకేష్

కుందూ ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరందిస్తామని తెలిపారు. వైసిపి ఇసు కాసురుల దెబ్బకు పెన్నానది విలవిల లాడుతోందన్నారు. పత్రికలు ఘోషిస్తున్నా, ప్రజలు మొరపెట్టుకుంటున్నా వైసిపి ఆగడాలు ఆగడం లేదన్నారు. ఇది బద్వేలు నియోజకవర్గంలోని లింగాలకుంట వద్ద పెన్నానది ఇసుక కోసం వెళ్తున్న టిప్పర్ లారీ అని, ఇసుక లోడ్ చేసుకున్నాక ఎక్కడికి తీసుకెళ్తారని అడిగితే బెంగుళూరు వెళ్తా మని డ్రైవర్ సమాధానమిచ్చారని చెప్పారు. ఇక్కడ ఇసుక కూతవేటు దూరంలోని గ్రామ ప్రజలకు దొరకదు కానీ, చెన్నయ్, బెంగుళూరులో మాత్రం విరివిగా దొరుకుతుందని వాపోయారు. ముఖ్యమంత్రి సొంత ప్రాంత ప్రజలకు గుక్కెడు నీళ్ల ఇవ్వలేని దుస్థితిలో లేరని చెప్పారు. టిడిపి అధికారంలోకి రాగానే వాటర్ గ్రిడ్ ద్వారా ప్రతిఇంటికీ కుళాయి ఇచ్చి, సురక్షితమైన తాగ ునీరు అందిస్తామన్నారు. చెరువుల నుంచి రైతులు పొలాలకు ఉచితంగా మట్టితోలుకునే హక్కు కల్పి స్తామని చెప్పారు. తీరప్రాంత ప్రజలు ఉచితంగా పెన్నానది నుంచి ఇసుక తెచ్చుకునే అవకాశం కల్పి స్తామని పేర్కొన్నారు. వైసిపి పాలనంలో రాష్ట్రంలోని ప్రజల ఆస్తులు, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి గూండాల పెట్రేగిపోతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. వైసిపి రౌడీ మూకలను ఉక్కుపాదంతో అణిచివేస్తామన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే సిపి రోడ్డు నుంచి కొత్తచెరువు, జోగిరెడ్డిగారిపల్లె, తిప్పనపల్లె వెళ్లే రోడ్డు పనులను పూర్తి చేస్తామన్నారు. బ్రహ్మం సాగర్ కుడికాల్వ పనులను పూర్తి చేసి సాగునీటి కష్టాలు తీరుస్తామన్నారు. మీ కోసం పనిచేసే చంద్రన్నను సిఎం చేసేందుకు మీవంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుకు విద్యా కానుక కొండంత అండ

- జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు రాష్ట్ర వ్యాపితంగా సోమవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 2094 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో 1,58,156 మంది విద్యార్థులకు రూ.40 కోట్ల నిధులతో జగనన్న విద్యా కానుక ద్వారా మూడు జతల యూనిఫాం,రెండు జతల సాక్స్ లు, ఒక జత షూ, బ్యాగు, బెల్టు, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, డిక్షనరీ అందిస్తామని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సోమవారం కార్యక్రమాన్ని నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మేయర్ సురేష్ బాబు, జిల్లాలోని శాసన సభ్యులు, పార్ల మెంట్ సభ్యులు కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత చదు వులతో ఇతర రాష్ట్రాలలో, దేశాలలో మంచి స్థానంలో స్థిరపడి వారి కుటుంబా ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడాలని భావించి సి ఎం జగన్ మోహన్ రెడ్డి విద్యా సంస్కరణలకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. సమాజం మరింత పురోగతి చెందాలన్నా, అసమానతలు తొలగాలన్న, కుటుంబాలలో ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలన్నా, సఖ్యత పెరగాలన్న తల్లిదండ్రులకు సమాజంలో గుర్తింపు, గౌరవం దక్కాలని విద్యార్థుల చదివే మార్గమని గుర్తించిందన్నారు. చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదని గమనించి ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి పైసాను విద్యార్థుల ఉన్నత చదువులకే ఉపయోగపడేలాగా పకడ్బందీ కార్యచరణ ప్రణాళికను అమలు చేస్తుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే బడులు తెరిచిన మొదటి రోజే జగనన్న విద్యా కానుక కింద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌తో కూడిన నాణ్యమైన కిట్ల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. 1642 ప్రాథమిక పాఠశాలలో 66,997 మంది విద్యార్థులు, 142 ప్రాథమికోన్నత పాఠశాలలో 15,434 మంది విద్యార్థులు, 310 ఉన్నత పాఠశాలలో 75,725 విద్యా ర్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేయునట్లు చెప్పారు. ప్రతి విద్యార్థికీ నాణ్యమైన జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తామని చెప్పారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో 8 రకాల వస్తువులతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లు సంసిద్ధం చేశామని తెలిపారు. వీటన్నిటిని బయోమెట్రిక్ అతంటికేషన్ ద్వారా విద్యార్థులకు అందజేస్తామని చెప్పారు. వీటిని ఉపయోగించుకుని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.

ముగిసిన సమ్మర్ క్యాంపు వేడుకలు

ప్రజాశక్తి-పోరుమామిళ్లటౌన్

స్థానిక గ్రంథాలయంలో మే 8 నుంచి జూన్ 11 వరకు 35 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా లైబ్రరియన్ ఆఫ్రిది, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు దాదాపీర్ తెలిపారు. వేసవి సెలవులలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానంతో కూడిన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. పాటలు, కథలు, క్యారమ్స్, చెస్, లూడో, బుక్ రీడింగ్, పేపర్ క్రాఫ్ట్ వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇంగ్లీషు టీచర్ గంగయ్యతో నిర్వహించిన స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమం విద్యార్థులకు అమితంగా ఆకట్టుకుందన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన మోక్షిత, సుహాన, నసిమున్, నజిరున్, అయిమన్ తదితర విద్యార్థులకు జెవివి నాయకులు మహమ్మద్ యాసిన్, పీర్ బాష, గంగయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. **చింతకొమ్మదిన్నె :** స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు విజయవంతంగా ముగిశాయని గ్రంథాల అధికారి ఇబ్రహీం పేర్కొన్నారు. విద్యార్థులకు దేశభక్తి గేయాలు, చిత్ర లేఖనం, డ్యాన్స్, చదరంగం, వివిధ రకాల ఆటల పోటీల్లో భాగంగా గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం ఎంఇఒ వెంకట్రామిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంధాలయాలు విజ్ఞాన భాండగరాలు అయ్యంకి వెంకటరమణయ్య, గడిచర్ల హరిసరోత్తమరవు కృషి వలననే ఈనాడు మనం గ్రంధాలయాల ను ఉపయోగించు కుంటున్నాం అని కొనియాడారు. కడప జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి జిల్లాలోని గ్రంధా లయాల కోసం ఎంతో కృషి చేస్తున్నారని గ్రంధాలయాధికారి పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలలో పాల్గొన్న ప్రతి విద్యార్థిని విద్యార్థులకు కన్సోలేషన్ బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు , పాఠకులు పాల్గొన్నారు.

సికె దిన్నె: సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న లైబ్రేరియన్

కడప అసెంబ్లీ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా మామిళ్ల బాబు

కడప : కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా మామిళ్ళ బాబును పార్టీ అధిష్టానం నిర్మించింది. ఈ సందర్భంగా మామిళ్ళ బాబు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా నియమించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు కు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతంకు, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు నాగ మధు యాదవ్‌కు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎన్ తులసి రెడ్డికి, శైలజానాథ్‌కు మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై విష్ణు ప్రీతం రెడ్డికి ఈ సందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, రాహుల్ గాంధీని ప్రధాని గా చేసేందుకు సాయి శక్తుల పని చేస్తానని అన్నారు

రక్తదానం ప్రాణదానంతో సమానం

కడప : రక్తదానం ప్రాణదానంతో సమానం అని టీచర్ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం. వి. రామచంద్రారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి జన్మదిన సందర్భంగా ఆయన కార్యాలయంలో రక్తదాన పోస్టర్లను ఆవిష్కరించారు. రక్తదానం చేసేందుకు యువత విద్య వంతుల ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయాలని ప్రచారం చేస్తూ కరీముల్లాను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. **కడప అర్బన్ :** యువత, విద్యావంతులు రక్తదాతలు కావాలని ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ ఎస్.ఎం. ఆసిఫ్ అన్నారు. ఈనెల 14న ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా ఎం.ఎం. హాస్పిటల్ వద్ద రక్తదాన కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్. ఎం. ఆసిఫ్, టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సీనియర్ సభ్యులు అబ్దుల్ రాయల్ కరిముల్లా, సౌమ్య, సుధా పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

వల్లూరు : మండలంలో శాంతిభద్రతలు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వల్లూరు ఎస్ఐ పెద్ద ఓబన్న హెచ్చరించారు. ఆదివారం గ్రామంలో ఎస్‌పి అన్బురాజన్ ఆదేశాల మేరకు మండలం పరిధిలోని పైడి కాలువ గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామంలోని గడ్డివాములు , గుడిసెల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సందర్భంగా ఎస్ఐ గ్రామ ప్రజలతో మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒకరూ ఎటువంటి గొడవలకు పాల్పడకుండా ఫ్యాక్షన్ వీడి ప్రశాంతంగా జీవితాన్ని గడపాలని కోరారు. గ్రామంలో ఎటువంటి చిన్న పార్టీ గొడవలకు పాల్పడినా, ప్రేరేపించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ మోహన్ రావు , హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ రెడి , దేవ ప్రసాద్ , ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

ప్రయివేట్‌కు వత్తాసు పలుకుతున్న విద్యాశాఖ

కడప అర్బన్ : కడప, అన్నమయ్య జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలకు పాఠశాల విద్యాశాఖ అధికారులు వత్తాసు పలుకుతున్నారని పిడియస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న ఆరోపించారు. ఆదివారం నగరంలోని పిడియస్ యు ఉమ్మడి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలలు ప్రారంభం కాకమునుపే 60 శాతం అడ్మిషన్స్ పూర్తి చేశాయని పేర్కొన్నారు. కేవలం నర్సరీకే రూ.30 వేల నుంచి రూ.40 వేలు తల్లిదండ్రుల దగ్గర వసూలు చేస్తున్నారని చెప్పారు. పలు పాఠశాలలు సిబిఎస్ఈ సిలబస్ లేనపప్పటికీ ఉన్నట్లు ప్రచారం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

విద్యుత్ ఛార్జీల పేరుతో బాదుడు తగదు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యుత్ ఛార్జీల పేరుతో బాదుడు తగదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వీరనాల శివనారాయణ తెలిపారు. స్థానిక ఆర్అండ్బి అతిథిగృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలు, సామాన్యులపై మోయలేని భారంగా విద్యుత్ ఛార్జీలున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పేరుతో పెద్ద ఎత్తున భారాలు మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శివనారాయణ

సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే విద్యుత్ భారాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జూన్ నెలలో విడుదల చేసిన కరెంటు బిల్లుల ద్వారా సామాన్య ప్రజానీకం ఉక్కిరిబిక్కిరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని సిపిఎం అనేకసార్లు ప్రభుత్వాన్ని కోరినా ఫలితంలేదన్నారు. ప్రస్తుత బిల్లులో ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ట్రూ అప్ ఛార్జీలు వంటి రకరకాల పేరుతో అదనపు భారం వేశారన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు శ్రీను, సంజీవ రాయుడు, మునికుమార్, గొర్రె కృష్ణ పాల్గొన్నారు.

వేంపల్లె : వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచడమే కాకుండా మరోమారు సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై వేల కోట్ల భారాన్ని మోపడం సరికాదని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్దుబాటు పేరుతో రెండు నెలలకు ఒకసారి పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే విరమించాలని డిమాండ్ చేశారు. నవరత్నాల పేరుతో సంక్షేమం అందిస్తామన్న జగన్రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో తొమ్మిది విడతలుగా విద్యుత్ ఛార్జీలు పెంచడం హేయమైన చర్య అన్నారు. చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఏనాడూ విద్యుత్ ఛార్జీలు పెంచకపోగా నాణ్యమైన విద్యుత్ను అందించారన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో గోగుల మల్లికార్జున, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బిజెపి, వైసిపి ప్రభుత్వాలకు రోజులు దగ్గర పడ్డాయి

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

బిజెపి, వైసిపి ప్రభుత్వాలకు రోజులు దగ్గర పడ్డాయని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొంగ నాటకాలు ఆడుతూ ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తున్నాయని ఆదివారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో తెలిపారు. హస్తినాలో దోస్తీ, ఆంధ్రలో కుస్తీ, ఢిల్లీలో సై, రాష్ట్రంలో నై అన్నట్లుందని ఎద్దేవా చేశారు. నేను కొట్టినట్లు నటిస్తా, నీవు ఏడిచినట్లు నటించు అన్నట్లుంది వారి పరిస్థితి అని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మళ్లిస్తోందని, రాష్ట్రంలో శాంతి కనిపించడం లేదన్నారు. దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని శ్రీకాళహస్తిలో జరిగిన బిజెపి సమావేశంలో ఆ ఆపార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా వ్యాఖ్యానించడం అక్షరాల వాస్తవమన్నారు. కేంద్ర నిధులను రాష్ట్రం మళ్లీస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఏమీ చేస్తోందని ఆయన ప్రశ్నించారు. ప్రత్యేకహోదాకు పంగనామాలు పెట్టి చట్టంలోని అనేక అంశాలకు స్వస్తి పలికి, రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం తీరని నమ్మక ద్రోహం చేసిందని చెప్పారు.

విద్యార్థుల ఎంపిక ప్రతిభకు నిదర్శనం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వివిధ కంపెనీలకు ఎంపికైన విద్యార్థులే తమ కళాశాల ప్రతిభకు నిదర్శనమని ఎస్పి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పాలా నాగేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో ఆదివారం జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ జాబ్ మేళాలో విద్యార్థులను ఉద్యోగస్తులుగా ఎంపిక చేసుకునేందుకు 11 కంపెనీల ప్రతినిధులు వచ్చారన్నారు.

ఎంపికైన విద్యార్థులతో నాగేశ్వరరెడ్డి, ప్రతినిధులు

జాబ్ మేళలో తమ విద్యార్థులే కాక కడప, ప్రొద్దుటూరు ఇతర ప్రదేశాల నుంచి కొంతమంది విద్యార్థులు వచ్చారన్నారు. ఇందులో 58 మంది విద్యార్థులు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఏడాదికి ఒక్కొక్కరికి రెండు లక్షల నుంచి మూడు లక్షల 50 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. తెలిపారు. తమ కళాశాల కేవలం చదువు చెప్పించడమే కాక విద్యార్థులకు ఉద్యోగాలను చూపడంలో కూడా ముందు ఉంటుందన్నారు. విద్యార్థులలోని నైపుణ్యాన్ని వెలికి తీయడం, వారిని ప్రతిభావంతులుగా చేయడం తమ కళాశాల ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో టెక్ మహేంద్ర, టెలీఫార్మన్స్, విప్రో, కాంసెంట్రిక్స్, ముత్తూట్ ఫైనాన్స్, ముత్తూట్ ఫిన్ కార్ప్ అస్తిర్తోపాటు వివిధ కంపెనీల ప్రతినిధులు, ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం జగదాంబ అరటి మొక్కలు, డిఎస్ఆర్ యువసేన వారి సౌజన్యంతో ఎక్సలెంట్ ఇన్స్టిట్యూట్, నాగార్జున పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన ఈ ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు చిట్టి, శిల్పారామం అధికారి సుధాకర్, నాగార్జున పాఠశాల కరస్పాండెంట్ గీత పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

గోడేరు వంకపై వంతెన నిర్మాణమెప్పుడో..?

గడపగడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే హామీ నెరవేరేనా..

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సీతారామపురం గ్రామ సమీపంలో గోడేరు వంకపై వంతెన నిర్మాణానికి రైతులు ఎదురుచూస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అధికారులకు తమ సమస్యను విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రైతులు స్వతహాగా నిర్మించుకున్న బండరాళ్ల కట్టడాలు గత ఏడాది వర్షం ధాటికి కొట్టుకొనిపోయాయి. సీతారామాపురం గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్ళాలంటే వంక దాటుకొని పోవాల్సిన పరిస్థితి. ప్రతి ఖరీఫ్ సీజన్లో వంక ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రైతులు, కూలీలు వ్యవసాయ పనులకు పోవాల్సిన పరిస్థితి. ప్రొద్దుటూరు-మైదుకూరు ప్రధాన రహదారిపై నుండి పంట పొలాలకు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఆ మార్గాన దారి లేకపోవడంతో వంక నీటిలో నుండి వెళ్లాల్సిందే. సంబంధిత అధికారులకు రైతులు పలుమార్లు కలిసి విన్నవించినా ప్రతిపాదనలకే పరిమితమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు నడిచి వెళ్లేందుకు ఉన్న ఏర్పాటు కూడా తొలగిపోవడంతో వారు దిగాలు చెందుతున్నారు. రూ.50లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి, నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణానికి చర్యలు చేపట్టలేదని తెలుస్తోంది. పంటలు సాగు చేసిన సమయంలో, దిగుబడి చేతికి అందివచ్చిన సమయంలో చాలా ఇబ్బందికరంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. గత సెప్టెంబర్ నెలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి స్వయంగా సమస్యను పరిశీలించి నిధులు మంజూరు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఆ మేరకు నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వేసవిలో నిర్మాణం చేపట్టకపోతే వర్షాకాలంలో సాధ్యపడదని రైతులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు ఉపయోగపడే విధంగా వంతెన నిర్మించాల్సి ఉందని కోరుతున్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాల్సిన ప్రదేశం

క్రమశిక్షణకు మారుపేరు ఉషోదయ పాఠశాల

ఉషోదయ యుపి పాఠశాల, ప్రపంచస్థాయి తేక్వాండో పోటీల్లో గెలుపొందిన ఉషోదయ విద్యార్థులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఉషోదయ యుపి పాఠశాల పాఠ్యాంశాల బోధనతోపాటు క్రమశిక్షణకు మారుపేరు. చదువు సంస్కారాలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగ, కరాటే వంటి వాటికి అధిక ప్రాధాన్యమిచ్చే పాఠశాల. 'ప్రజాశక్తి'తో పాఠశాల కరస్పాండెంట్ శివ నారాయణ మాట్లాడుతూ చిలమకూరు గ్రామం లో 1998లో కేవలం 20 మందితో ప్రారంభమై ప్రస్తుతం 230 మంది విద్యార్థులతో పాఠశాలను నడుపుతున్నామన్నారు. నర్సరీ నుండి 7వ తరగతి వరకు మాత్రమే విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యార్థులకు చదువు తోపాటు క్రమశిక్షణ, క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. తమ పాఠశాలలో చదువుకొని క్రమశిక్షణ అలవర్చుకున్న ఎందరో విద్యార్థులు ఉన్నత తరగతుల్లో రాణించారన్నారు. ఇంజనీర్లు, డాక్టర్లుగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులుగా స్థిరపడ్డారన్నారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో పోటీ పడేందుకు విద్యార్థులకు డిజిటల్ తరగతులను కూడా ఏర్పాటు చేశామన్నారు. చిన్నపిల్లలు ఆడుకొనుటకు ప్లే ఏరియాను కూడా ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల్లో క్రీడాసక్తి పెంచేందుకు పిఇటిని కూడా నియమించామన్నారు. ప్రతిరోజు యోగా, కరాటే, తేక్వాండో క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తేక్వాండో పోటీల్లో ఉషోదయ పాఠశాల విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ప్రతిభ కనబరచారన్నారు. ప్రపంచ స్థాయి తేక్వాండో పోటీల్లో 2 బంగారు పతకాలు, 6 సిల్వర్, 3 బ్రాంచ్ పతకాలతోపాటు, నేషనల్ ఓపెన్ తేక్వాండో ఛాంపియన్ షిప్లో 6 బంగారు పతకాలు, 4 సిల్వర్ పతకాలు సాధించినట్లు ఆయన వివరించారు. ప్రపంచస్థాయిలో దేశానికి పేరు తెచ్చిన విద్యార్థులు ఉషోదయ పాఠశాల విద్యార్థులు అంటే ఎంతో గర్వంగా ఉంటుందన్నారు. ఇలాంటి కీర్తి ప్రతిష్టలు పాఠశాలకు వచ్చేలా కోచ్ సుమన్ మాస్టారు ఎంతో కృషి చేశారన్నారు. తమ విద్యార్థులకు ప్రతిరోజు యోగా కార్యక్రమాలు చేయించడం ద్వారా ఉత్సాహంగా చదువులో రాణిస్తున్నారని అన్నారు. అనుభవంగల ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయిస్తున్నామన్నారు. ఆ కారణంగా ఉషోదయ పాఠశాల దినదినాభివృద్ధి చెందుతోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అలాగే 2023-24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభ మయ్యాయని తెలిపారు. ఒత్తిళ్ల మధ్య చదువు చెప్పే పాఠశాలలో కాకుండా పిల్లలను ఎల్లప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంచి చదువు బోధించే పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

కరస్పాండెంట్ బి. శివ నారాయణ

ముగిసిన వేసవి శిబిరాలు

బహుమతులు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఎపి పౌర గ్రంథాలయశాఖ ఆదేశాల మేరకు కడప జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ లింగాల ఉషారాణి ఆధ్వర్యంలో మే 8నుంచి జూన్ 11 వతేదీ వరకు పులివెందుల గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణాశిబిరాలు ఆధివారం ఘనంగా ముగిశాయి. గ్రంథాలయ నిర్వాహకుడు కృష్ణకిషోర్రెడ్డి ఆధ్వర్యంలో 35 రోజులుగా విద్యార్థులు పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శిక్షణాశిబిరంలో పాల్గొన్న 40 మంది విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు, వైయస్ వెంకటరెడ్డి చేతుల మీదగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులు గ్రంథాలయం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్ర, మునిబాబు, పద్మనాభరెడ్డి, శంకర్ నాయక్, వనమాల సురేష్, రవిశంకర్, పోస్టల్ డిపార్ట్మెంట్ బాలకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ అరుణ్కుమార్, సైదాపురం పుస్తక నిక్షిప్త కేంద్రం నిర్వాహకులు ప్రతాప్రెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాపాడు : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం చివరి రోజు సందర్భంగా ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి శివశంకర్రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. గణితం, ఆంగ్లం, సైన్స్, సంగీతం, చిత్రలేఖనం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, బిడిసి కృష్ణారెడ్డి, మహేశ్వర్రెడ్డి, రఫీ పాల్గొన్నారు.

జమ్మలమడుగు : గ్రంథాలయాలు విజ్ఞాన సోపానాలని, విజ్ఞాన భాండాగారాలని పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ యం.యల్.నారాయణరెడ్డి పేర్కొన్నారు. జమ్మలమడుగు ప్రభుత్వశాఖ గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం గ్రంథాలయాధికారి జింకా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల పురోగతికి ఎంతో సహకరిస్తాయన్నారు. వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పుస్తక పఠనం వల్ల ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. లైబ్రరీ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుస్తకాలు నిజమైన నేస్తాలని తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కుండా భాస్కర్ గడియారం సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి మిరియాల శివ గణపతి ప్రసంగించారు. తర్వాత సమ్మర్ క్యాంపులో వివిధ విభాగాలు నిర్వహించిన శ్రీనివాసులు (జికె కంప్యూటర్స్) అశోక్రెడ్డి, బాబా ఫక్రుద్దీన్ను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. జమ్మలమడుగు నుండి ఐఐటి ర్యాంకును సాధించిన విద్యార్థి పి.సుందర్ను కమిటీ వారు శాలువాతో సన్మానించారు. సమ్మర్ క్యాంపులో వివిధ విభాగాల్లో నిర్వహించిన పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను గ్రంథాలయాధికారి కమిటీ వారి చేత అందజేశారు. కార్యక్రమంలో బండారు శ్రీనివాసులు, మిరియాల శివగణపతి, కుండా భాస్కర్, ఎం.వి.కొండారెడ్డి, ఎస్.అమీర్బాషా, టి.దాదా ఖలందర్బాషా, పి.లక్ష్మీనారాయణ, దర్పణం శ్రీనివాసులు, టి.నరసింహులు మొదలగు కమిటీ సభ్యులు, మరియు గ్రంథాలయ సిబ్బంది ఎ.బాలచంద్ర, బి.వి.సుబ్రహ్మణ్యం, డి.ఇమామ్ హుస్సేన్, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

జూనియర్ కళాశాల ప్రారంభించాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించాలని గతంలో అధికారులు ఆదేశాలు జారీ చేసినా, అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు వల్ల చుట్టుపక్కల గ్రామాల పేద విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. గతేడాది ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించాలని అధికారులు ఆదేశాలిచ్చినా అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు స్పందించి జూనియర్ కళాశాల తరగ తులు ప్రారంభించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కలివేల రాజశేఖర్, ఎర్రంపల్లి అజయ్, నాయకులు అరవింద్, దేవకుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గండి సునీల్కుమార్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని దొండపాడు రోడ్డులో ఆదివారం సిఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ తనిఖీ చేశారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

లోకేష్ పాదయాత్రకు సంఘీభావం

వేంపల్లె : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేస్తున్న పాదయాత్రకు వేంపల్లె టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. ఆదివారం బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు క్రాస్ నుండి బద్వేలు వరకు లోకేష్తో కలిసి టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, పివి రమణ, గోటూరు నాగభూషణం, దొంతు సుమన్, కృష్ణారెడ్డి, అమర్నాథ్రెడ్డి, మోహన్రెడ్డి, పట్టేం అశోక్, పలువురు పాదయాత్రలో పాల్గొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో పాదయాత్ర ముగింపు ఉండడంతో సంఘీభావం తెలిపేందుకు వెళ్లినట్లు మహమ్మద్ షబ్బీర్ తెలిపారు.

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - కడప

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు నోడల్ రిసోర్స్ సెంటర్, కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) లో జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ఆంగ్ల మాధ్యమ బోధనా విధానంపై ఆరు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిశాయి. శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ తరగతులను ఈనెల 5 నుంచి 10 వరకు నిర్వహించినట్లు నోడల్ రిసోర్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ హరిప్రసాద్ తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ కళాశాల అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమ బోధన ప్రాముఖ్యత, విద్యార్థులకు గల ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో నోడల్ రిసోర్స్ సెంటర్ కో - ఆర్డినేటర్ డా. హరి ప్రసాద్, జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బి.తిప్పాయపల్లె వాసి అదృశ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని బి.తిప్పాయపల్లె గ్రామానికి చెందిన పత్తి నాగేశ్వరరెడ్డి (43) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. నాగేశ్వరరెడ్డి శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించడంలేదని ఆదివారం వారు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 90100 31436, 92900 52111, 80084 43359 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. నాగేశ్వరెడ్డి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

కుందూ నదిలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని సీతారాంపురం గ్రామం వద్ద కుందూ నదిలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. విష యాన్ని స్థానికులు పోలీసులకు తెలపడంతో వారు సంఘ టన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. తెల్లని చొక్కా, నల్లని ప్యాంటు ధరించి ఉన్నాడని, 40 సంవత్సరాల వయసు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఆనవాళ్లు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని కలమల్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జూదం ఆడుతున్న ఐదుగురుని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. ఆర్టిపిపి ట్యాంకర్ల గేట్ వద్దనున్న కంపచెట్లల్లో మంగతాయి ఆడుతున్నట్లు సమాచారంతో దాడి చేసినట్లు ఆయన తెలిపారు. వీరి వద్దనుంచి రూ.5,110 స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - వల్లూరు

కడప-తాడిపత్రి జాతీయ రహదారి తప్పెట్ల ఓవర్ బ్రిడ్జిపై ఆదివారం బైక్ను గుర్తుతెలియని వాహ నం ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. కడప రాజారెడ్డి వీధికి చెందిన వెంకటలక్ష్మి, ఆమె ఇద్దరు పిల్లలు స్కూటీ మీద కమలాపురం నుంచి కడపకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను 108 వాహనంలో కడప రిమ్స్కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

విద్యారంగంలో తిరుగులేని సంస్థ బాలాజీ హైస్కూల్

- ఈ ఏడాది ఐసి బ్యాచ్ ప్రారంభం, చక్కటి హాస్టల్, బస్సు సౌకర్యం : బైరెడ్డి రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యారంగంలోనే నియోజకవర్గంలో తిరుగులేని విద్యాసంస్థగా బాలాజీ హైస్కూల్ ఉందని ఆ పాఠశాల డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రారెడ్డి 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 1990లో పాఠశాలను ప్రారంభించామన్నారు. 33ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. విద్యారంగంలో అత్యంత అనుభవంగల యాజమాన్యంతోపాటు ఉపాధ్యాయ బృందం కూడా పనిచేస్తున్న ఏకైక పాఠశాల బాలాజీ హైస్కూల్ అన్నారు. గడచిన 33 సంవత్సరాల్లో ప్రతి ఏడాది జమ్మలమడుగు పట్టణంలో, మరికొన్ని సంవత్సరాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి సరికొత్త ప్రభంజనాన్ని సృష్టిస్తున్నామన్నారు. కార్పొరేట్ పాఠశాలకు ఏ మాత్రం తీసిపోకుండా తమ పాఠశాల విద్యార్థులు మార్కులు సాధిస్తున్నారన్నారు. ఈ ఏడాది 590 మార్కులతో జమ్మలమడుగు చరిత్రను తిరగ రాశామన్నారు. ఐఐటి, నీట్, ఇంజనీరింగ్ కోసం విద్యార్థులకు నాలుగో తరగతి నుంచి శిక్షణనిస్తున్నామన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, సైన్స్ అండ్ ఇంగ్లిష్, కంప్యూటర్ ల్యాబ్లు ఉండడం మా పాఠశాల ప్రత్యేకత అన్నారు. ఈ ఏడాది ఐసి బ్యాచ్లో ప్రత్యేక అనుభవంగల అధ్యాపకులచే బోధన చేయించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీలో విద్యార్థులను నైపుణ్యంగల వారిగా చేయడం ఐసి బ్యాచ్ ప్రత్యేకత అన్నారు. నర్సరీ నుంచి టెన్త్ క్లాస్ వరకు విభాగాలుగా ఏర్పాటు చేసి ఇన్ఛార్జిల ద్వారా పర్యవేక్షణ చేయిస్తామన్నారు. విద్యార్థులలో విద్యతోపాటు స్పోకెన్ ఇంగ్లీష్పై స్కిల్స్ పెంపొందించనున్నట్లు వివరించారు. ఆల్ ఇండియా స్థాయిలో బ్రెయిన్ ఫీడ్ వారు ఇచ్చిన అవార్డులలో వరుసగా రెండవసారి ఎంపిక కావడం జిల్లాలోనే ఒక ప్రత్యేకతన్నారు. దూర ప్రాంతం కలిగిన విద్యార్థులకు హాస్టల్ వసతి ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం ఉందన్నారు. తన కూతురు బైరెడ్డి నిఖిలారెడ్డి పాఠశాల కరస్పాండెంట్గా ఉంటూ విద్యార్థుల పట్ల ప్రత్యేకంగా నిఘా పెడుతుందన్నారు. వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకుపోవడంలో ఆమె కృషి చేస్తుందన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు, నర్సరీ, ఎల్కెజి, యుకెజి, ప్లే స్కూల్ వాతావరణంతోపాటు వారికి కావలసిన ఎక్విప్మెంట్స్, డిజిటల్ క్లాస్ రూమ్ల ద్వారా ఈ ఏడాది బోధన చేయిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు ఆలోచించి తమ పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు. మీ పిల్లల కలలను మా బాలాజీ హైస్కూల్ ద్వారా సాకారం చేసుకోవాలని ఆయన కోరారు.

డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి

ఆహ్లాదకర వాతావరణంలో బాలాజీ హైస్కూల్ భవనం

పంపిణీకి సిద్ధంగా జగనన్న విద్యా కానుక కిట్లు

ప్రజాశక్తి - చాపాడు

2023-24విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పూర్తిస్థాయిలో పాఠశాలలకు సరఫరా చేసినట్లు ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. సోమవారం పాఠశాలలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 61 పాఠశాలలకుగానూ 3,384 విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బూట్లు, సాక్స్, బాగ్స్, యూనిఫామ్స్, బెల్ట్స్, పుస్తకాలు అన్ని పాఠశాలలకు అందజేస్తామన్నారు. ఆదివారం పాఠశాలలకు సరఫరా చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభానీ, ఎంఆర్సి సిబ్బంది, సిఆర్పిలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి సరఫరాను పర్యవేక్షిస్తున్న ఎంఇఒ, తహశీల్దార్

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL GUDGE: KADAPA
O.S.NO: 1173 OF 2021

Chappidi Venkata Subba Reddy, Son of Chappidi Subba Reddy, Hindu, aged about 56 years, residing at Door No: 9/ 120-A, Kapu Street, Mannuru Village, Rajampeta Mandal, Kadapa District .
...Plaintiff

Vs

1) P.M.Anasuya Devi, Wife of Gorla Prabhakar Reddy, Daughter of late P.M.Gangi Reddy & late Pilla Manchala Narayanamma, Hindu, aged about 48 years, Residing at Door No.7/22, Jaya Nagar Colony, Kadapa City.
2) P.M.Narmada, Wife of Dr.Sarath Reddy, Daughter of Late P.M.Gangi Reddy & Late Pilla Manchala Narayanamma, Hindu, aged about 40 years, Residing at Door No.25-23, Reddyvaripalli Village, T.Sundupalli(Mandal), Kadapa District.
...Defendants No.5&6

SUMMONS TO NO: 5 & 6 DEFENDANTS UNDER ORDER 5 RULE 1 & 5 C.P.C

Where as the Plaintiff here in filed the suit against you being Defendants No: 5 & 6 and others for recovery of debt due under suit Pronote and the said suit stand posted on 19-06-2023 for your appearance therefore you being the Defendants No:5 & 6 here by instructed to appear before the Hon'ble court on 19-06-2023 at 10-30 A.M. sharp personally or through an Advocate, failing which the matter will be decide as Ex-parte.

//By Order of the Hon'ble Court//

S.MD.KHALEEL GHOUSE & P.ABBAS KHAN
Advocates for Plaintiff

నేడు యథావిధిగా స్పందన

ప్రజాశక్తి- రాయచోటి

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రావాలని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎపిఎస్‌పి పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు.అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

సెలవులకు టాటా..
పోదాం బడిబాట..!

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- సమస్యలతో స్వాగతం
- పూర్తి కాని నాడు-నేడు పనులు
- విద్యా కానుక కిట్లు పూర్తిస్థాయిలో అందేనా
- జిల్లాలో తగ్గని ఎండలు
- ఈనెల 17 వరకు ఒంటిపూట బడులు

ప్రజాశక్తి - రాయచోటి

పాఠశాలలకు సెలవులు నిన్నటితో ముగిశాయి. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2236 ప్రభుత్వ పాఠశాలలు ,574 ప్రయివేట్ పాఠశాలలో మొత్తం విద్యార్థులు 2,55,094 మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. మొదటి విడతలో నాడు - నేడు పనులు 963, రెండవ విడతలో 766 మంజూరయ్యాయి. వాస్తవానికి రెండవ విడత నాడు-నేడు పనులు ప్రారంభమై జులై నాటికి పూర్తి కావాల్సి ఉంది. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని గురుగుపల్లెలో ప్రభుత్వ పాఠశాల్లో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గాలివీడు మండలంలోని వీరబల్లె చెరువుపల్లి లో రెండవ విడత లో నాడు నేడు పనులు మంజూరయినప్పటికీ ఉన్న పాఠశాలను పడగొట్టారు. దీంతో విద్యార్థులను అంగన్వాడీ కేంద్రంలో వెళ్తున్నారు. అక్కడ స్థలం సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాడు నేడు నిర్మాణ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో జిల్లా వ్యాప్తంగా విద్యా కానుక కిట్లుగా ఇచ్చే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, బ్యాగులు, బూట్లు 80 శాతం వరకు చేరాయి. ఏ పాఠశాలలోనూ పూర్తిస్థాయిలో కిట్లు పంపిణీ ప్రక్రియ జరగలేదు. ఒక ప్రక్క రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు - నేడు పనుల ద్వారా మౌలిక పరిస్థితులను ఏర్పాటు చేస్తున్నామని ప్రచార ఆర్భాటాలు చేస్తూ ఉంది. తగ్గని ఎండలు : అన్నమయ్య జిల్లాలో ఎండలు విపరీతంగా ఉన్నాయి. గతంలో జూన్ మొదటి వారంలోని వాతావరణ మార్పుల వల్ల ఉష్ణోగ్రత తగ్గేది. ఏడాది జూన్ 12వ తేదీ అయినా కూడా 38 నుండి 41 శాతం వరకు ఉష్ణోగ్రత ఉంది . ఎండలు తీవ్రత కారణంగా నేటి నుండి 17 తేదీ వరకు ఉదయం 7:30 గంటల నుండి 11:30 గంటల వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు.

పాఠశాలల్లో వసతులు పూర్తి చేశాం

జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నాయి. అన్ని పాఠశాల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేశాం. ఇంకా ఏవైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- శ్రీరామ్ పురుషోత్తం, జిల్లా విద్యాశాఖ అధికారి, అన్నమయ్య జిల్లా.

నాణ్యమైన రోడ్లు వేయడమే లక్ష్యం

ఆర్అండ్‌బి ఎస్‌సి వై.సహదేవరెడ్డి

ముఖా ముఖి..

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో నాణ్యమైన రోడ్లు వేయడమే తమ లక్ష్యమని ఆర్అండ్‌బి ఎస్‌సి వై. సహదేవరెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో రోడ్లు ఎలా వేయ్యాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో ఇఇ, డిఇ, జెఇ వివరాలు తెలపండి?

జిల్లా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా రాజంపేట, మదనపల్లె ప్రాంతాలలో ఇఇ కార్యాలయాలున్నాయి. రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు, మదనపల్లి, పీలేరు నియోజకవర్గాలలో డిఇ కార్యాలయాలున్నాయి. జెఇలు తొమ్మిది మంది ఉన్నారు.

జిల్లాలో ప్రస్తుతం ఎక్కడ పనులు జరుగుతున్నాయి? బడ్జెట్ ఎంత?

ప్రస్తుతం రాజంపేట డివిజన్ పరిధిలో పనులు జరుగుతున్నాయి. వైఎస్ఆర్ జిల్లాలోని కోడూరు నుంచి సి. కమ్మపల్లి వయా రెడ్డివారిపల్లె, చెయ్యవరం రహదారి కి 0/4 కిలో మీటర్ల వరకు హై లెవెల్ వంతెన నిర్మాణం రూ. 1200 లక్షలతో పనులు జరుగుతున్నాయి. వైఎస్ఆర్ జిల్లాలోని చిట్వేల్ మండలంలో చిట్వేలి-పుల్లంపేట రోడ్డు 0/0 నుంచి 10/8 నుంచి 16/2 వరకు రోడ్డుకు ప్రత్యేక మరమ్మతులు కోసం రూ. 180.00లక్షలతో పనులు జరుగుతున్నాయి. స్థానిక వాగుమీదుగా నూలివీ డు- పందికుంట - కొర్లకుంట రహదారి 313 కిలోమీటర్లు 7/ 0-2 వద్ద మైనర్ వంతెన 3 వి ఎక్స్ 4.00 ఎంటిఎస్ పునర్మాణం కోసం రూ. 61.00 లక్షల తో పనులు త్వరలో ప్రారంభిస్తాం. రాజంపేట - కదిరి- తుంకూర్ రోడ్డు ఎస్ హెచ్ 59 రాయచోటి పట్టణ పరిమితులు కిలోమీటర్ 52/400 నుండి 56/00 వరకు సిసి డే రియన్‌లను అందించడంతోపాటు రోడ్డు కోసం రూ.1600.00 లక్షలతో పనులు జరుగుతున్నాయి. చిత్తూరు జిల్లాలో బి.కొత్తకోట- బి రంగీ రహదారిని 0/800 నుండి/643 వరకు రూ. 23.00లక్షల తో పనులు జరుగుతున్నాయి. చిత్తూరు జిల్లాలో బుర్లపల్లె -సదుం- చెన్న రాయుని పల్లె రహదారి కిలోమీటర్ 0/000 నుండి 18/300 వరకు మెరుగుదల వర్కింగ్ రీచ్ 8/300 నుండి 18/300 కిలో మీటర్ల వరకు రూ. 2500.00లక్షలతో పనులు జరుగుచున్నాయి . అన్నమయ్య జిల్లాలో జాతీయ అభివృద్ధి బ్యాంక్ స్కీం కింద రాయచోటి -సుండుపల్లె -పింఛా రహదారులు , రాజంపేట -కదిరి- తుంకూర్ రహదారిలు , చిన్న మండెం -సంబేపల్లి రహదారులు , నిమ్మనపల్లె - వాయల్పాడు -గుర్రంకొండ- గాలివీడు రహదారుల వెడల్పు కోసం రూ.10542.00లక్షల తో పనులు జరుగుతున్నాయి. జిల్లాలో సిఆర్ఎ రోడ్డు నుండి వై కోట రోడ్డు కి.మీ .0/0 నుండి 12/0 వరకు ఎఆర్ పేట ఆర్ఎస్ కొర్లకుంట, చెన్నరాజుపోడు మీదుగా రహదారి రహదారుల మరమ్మతుల కోసం రూ. 200.00 లక్షలతో పనులు పూర్తయ్యాయి.

జిల్లా కేంద్రంలో రింగ్ రోడ్డు మరమ్మతులు ఎప్పుడు పూర్తి చేస్తారు?

జిల్లా కేంద్రంలోని రాయచోటి రింగ్ రోడ్డు 2009 వ సంవత్సరంలో మంజూరైంది. నిర్మాణ పనులు కూడా దాదాపు పూర్తయ్యాయి. మదనపల్లి రింగ్ రోడ్ సర్కిల్, చెన్న ముక్క పల్లె వద్ద కొంత నిర్మాణ పనులు కొంత పెండింగ్ ఉన్నాయి . బాధితులు కోర్టులో వేసి ఉన్నారు. సమస్యలు పరిష్కారం అవ్వగానే త్వరలో పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

గత సంవత్సరం తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు జరుగుతున్నాయా?

గత సంవత్సరం తుఫాను కారణంగా దెబ్బ తిన్న రహదారులకు రూ.888.02 లక్షల బడ్జెట్ తో నిర్మాణ పనులు పూర్తి అయినాయి. ఈ ఏడాది కొత్త బడ్జెట్ రహదారులకు ఇంకా రాలేదు. త్వరలో బడ్జెట్ కేటాయిస్తారు. వెంటనే రహదారి నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం.

లోకేష్‌ను విమర్శించే స్థాయి 'మేడా'కు లేదు

రాజంపేట టిడిపి పార్లమెంటు అభ్యర్థి గంటా నరహరి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబు, నారా చంద్రబాబు నాయుడును విమర్శించే స్థాయి రాజంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జున రెడ్డికి లేదని రాజంపేట టిడిపి పార్లమెంటు అభ్యర్థి గంటా నరహరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేడా ఆక్రోశంతో శనివారం విలేకరుల సమావేశంలో లోకేష్ ను, చంద్రబాబు నాయుడును విమర్శించడం సరికాదని అన్నారు. 2014లో తెలుగుదేశం పార్టీ తరపున గెలిచి టీటీడీ బోర్డు సభ్యులుగా పనిచేశారని, గత ఎన్నికల ముందు మేడా తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి గురించి మాట్లాడి రాబోయేది తెలుగుదేశం పార్టీయేనని ఘంటా పదంగా ఒక ప్రముఖ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. రూ .2000 కోట్లు కాంట్రాక్టులు పనులు తీసుకొని అవి పూర్తి చేయలేక, వాటికి బిల్లులు తెచ్చు కోలేక తలకిందులు అయిపోతున్న మేడా పరిస్థితి ప్రజలందరికీ తెలుసని అన్నారు. రానున్నది తెలుగుదేశం పార్టీ అని తెలిసి., మళ్ళీ పార్టీలోకి రావడానికి ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నారో అందరికీ తెలుసునన్నారు. 800 కోట్లు పనులు రాజంపేట నియోజకవర్గంలో చేశామంటున్నారని, ఎక్కడ చేశారో ప్రజల ముందు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నందలూరు మండలంలో మేడా తన కుటుంబ సభ్యులతో కలిసి వేల ఎకరాలను ఆక్రమించుకున్నారని తెలిపారు. చరిత్రలో లేని విధంగా సొంత పార్టీ వారే వ్యతిరేకంగా కరపత్రాలు పంచిన చరిత్ర మేడాదే అన్నారు. మేడా రాజకీయ సన్యాసం పుచ్చుకోవాల్సిన పరిస్థితి అతి త్వరలోనే ఉందన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ బాబు రాజంపేట నియోజకవర్గంలో సంధించిన నాలుగు ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగే సత్తా ఉందా అని ప్రశ్నించారు. ఇప్పుడైనా తప్పుడు ప్రచారాలు మానుకొని, ముందు, వెనుక ఆలోచించి మాట్లాడాలన్నారు.

30 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు.ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు, యర్రావారిపాలెం, కెవి పల్లి, కలికిరి, కలకడ, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, పులివెందుల, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది కంటి రోగులకు పరీక్షల నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 30 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 45 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ కోసం వచ్చిన రోగులతో పాటు వారికి సహాయంగా వచ్చిన వారికి కూడా భోజనం వసతి కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి.ఆర్ స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్ బాష, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, ఆప్త్మాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ముగింపు సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులు గా బిటి కళాశాల కరస్పాండెంట్ మునిరత్నం, ఎంఇఒ ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విజ్ఞాన సంపత్తిని పెంచుకొని విద్యార్థినీ విద్యార్థులు అభివృద్ధి బాటలో ఎలా పయనించవచ్చో వివరించారు. కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించిన రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ కె. సహదేవరావు, విశ్రాంత ఉపాధ్యాయులు, కళాకారులైన సర్వ శ్రీ రెడ్డప్ప, మదనమోహన్, ప్రసాద్ శర్మ, దీక్ష ప్రిన్సిపాల్ నాగార్జున. రమణమ్మ, మణి, భాను ప్రకాష్ మరియు చిత్రలేఖన ఉపాధ్యాయులు వి.ఎం నాగరాజ, శిరీష మరియు కథ నవలా రచయిత టిఎస్ఎ కృష్ణమూర్తి, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, మిమిక్రీ కళాకారులు హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి, వివేకానంద ఫౌండేషన్ భాను ప్రకాష్ గ్రంథాలయ అధికారిణి వసంత కుమారి, గ్రంథాలయ సిబ్బంది జయమ్మ కలసి ఘనంగా సన్మానించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో ఆంగ్ల తెలుగు భాషలలో వ్యాకరణం, వాక్య నిర్మాణం చిత్రలేఖనంలో, పఠనంలో, కథలు చెప్పడంలో, భగవత్ గీత పఠనంలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం, వారితోపాటు పాల్గొన్న విద్యార్థుల ందరికీ సర్టిఫికెట్లు అందజేయశారు.

విజేతకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

వైసిపికి ఇచ్చిన సీట్లు మాకిస్తే

'సీమ'ను అభివృద్ధి చేసి చూపిస్తాం

- ఇసుకాసురుల దెబ్బకు పెన్నానది విలవిల
- అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- బద్వేల్ నియోజకవర్గంలో సాగునీటి కష్టాలు తీరుస్తాం
- వైసిపి రౌడీ మూకలను ఉక్కుపాదంతో అణిచివేస్తాం
- పాదయాత్రలో నారా లోకేష్

లింగాలకుంట వద్ద పెన్నానది ఇసుక కోసం వెళ్తున్న టిప్పర్ లారీని సెల్ఫీ ద్వారా చూపుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-బద్వేల్/ అట్లూరు

రాయలసీమ వాసులు జగన్‌కు 49 మంది ఎమ్మెల్యేలను గెలిపించి ఇస్తే వారు సీమకు చేసిందేమిటని, రాబోవు ఎన్నికల్లో వైసిపికి ఇచ్చిన సీట్లు తమకు ఇస్తే రాయలసీమను అభివృద్ధి చేసి చూపిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. జగన్ పాలనలో రైతులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వాటి ధరలూ విపరీరంగా పెరిగిపోయాయని తెలిపారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 123 రోజుకు చేరుకుంది. ఆదివారం కడప జిల్లా బద్వేలు నియోజకవర్గంలోని నదియాబాద్ విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర సోమేశ్వరపురం, ఎర్రబల్లె, అప్పరాజుపేట, రాజుపాలెం, వెంకటశెట్టిపల్లి, కొంగలవీడు, శివరాంనగర్, శంకరాపురం క్రాస్, చింతలచెరువు క్రాస్, బయ్యనపల్లి, అబ్బా సాహెబ్, బద్వేలు శివారు విద్యానగర్ విడిది కేంద్రం వరకూ సాగింది. ఆయా ప్రాంతాల్లో రైతులు, స్థానికులు, విద్యార్థులతో ముఖాముఖి, సమావేశాలు, మాటామంతీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో లోకేష్ మాట్లాడుతూ సీమ రైతులకు నీరిస్తే బంగారం పండిస్తారని చెప్పారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో డ్రిప్‌పై సబ్సిడీని ఎత్తేసి రైతులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పాత డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని తీసుకొస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ. 11,700 కోట్లు ఖర్చు చేశారని, అందులో వైసిపి ప్రభుత్వం పది శాతం కూడా వ్యయం చేయలేదని వాపోయారు. అధికారంలోకి వచ్చిన వెంటను భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో అన్నదాతకు రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామని పేర్కొన్నారు. ఒకే సంతకంతో రూ.50 వేల లోపు ఉన్న రుణాలన్నీ మాఫీ చేసి చంద్రబాబునాయుడే అన్నారు. టిడిపి హయంలోనే పులివెందులకు నీళ్ల ఇచ్చారన్నారు. జగన్ పాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. రైతుల ఆత్మహత్యల్లో ఎపి దేశంలోనే నంబర్ 3 స్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో నంబర్ 2గా ఉందని చెప్పారు. పంట నష్టం వాటిల్లితే కనీసం పంట నష్టం అంచనా వేసే దిక్కు జగన్ ప్రభుత్వంలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి, కృష్ణా, పెన్నా అనుసంధానం ద్వారానే సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కరం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. లోయర్ సగిలేరు ప్రాజెక్టును ఆధునీకరిస్తామని బద్వేల్ ఉప ఎన్నికల సందర్భంగా జగన్ హామీ ఇచ్చి మోసం చేశారని పేర్కొన్నారు. ముంపుకు గురై భూములు కోల్పోయిన రైతులను ఆదుకుంటామన్నారు. బద్వేల్‌లో టిడిపి జెండా ఎగురవేస్తే పెండింగ్ ప్రాజెక్టులు, బ్రిడ్జి పనులు పూర్తి చేసే బాధ్యత తనదని తెలిపారు. జగన్ సొంత బ్రాండ్లు అమ్ముకోవడానికి చెరకు రైతులను వేధిస్తున్నాడని, బెల్లం అమ్ముకోవడానికి వీలులేకుండా అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. బద్వేల్ నియోజకవర్గంలో సాగునీటి కష్టాలు తీర్చడానికి పిల్లకాలువ తవ్వుతామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాయలసీమలో హార్టి కల్చర్‌ని ఎక్కువుగా ప్రోత్సహిస్తామని చెప్పారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తాం. మామిడి, దానిమ్మ, బొప్పాయి, చీనీ, కర్జూరం ఇలా వీటిలో అనేక రకాల మొక్కలు ఇక్కడే పెంచే విధంగా రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, వ్యవసాయ అనుబంధ రంగాలను కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామని తెలిపారు. జూస్ ఫ్యాక్టరీలు రావడానికి కావాల్సిన రకాలు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం, సెరీ కల్చర్ ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామని తెలిపారు. సోమశిల ముంపు బాధితులకు టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని, మొదటి 18 నెలల్లో పరిహారం అందిస్తామని తెలిపారు. బద్వేల్ నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే అదనంగా మరో 80 వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉందని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కుందూ ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరందిస్తామని తెలిపారు. వైసిపి ఇసుకాసురుల దెబ్బకు పెన్నానది విలవిలలాడుతోందన్నారు. పత్రికలు ఘోషిస్తున్నా, ప్రజలు మొరపెట్టుకుంటున్నా వైసిపి ఆగడాలు ఆగడం లేదదన్నారు. ఇది బద్వేలు నియోజకవర్గంలోని లింగాలకుంట వద్ద పెన్నానది ఇసుక కోసం వెళ్తున్న టిప్పర్ లారీ అని, ఇసుక లోడ్ చేసుకున్నాక ఎక్కడికి తీసుకెళ్తారని అడిగితే బెంగుళూరు వెళ్తామని డ్రైవర్ సమాధానమిచ్చారని చెప్పారు. ఇక్కడ ఇసుక కూతవేటు దూరంలోని గ్రామప్రజలకు దొరకదు కానీ, చెన్నయ్, బెంగుళూరులో మాత్రం విరివిగా దొరుకుతుందని వాపోయారు. ముఖ్యమంత్రి సొంత ప్రాంత ప్రజలకు గుక్కెడు నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో లేరని చెప్పారు. టిడిపి అధికారంలోకి రాగానే వాటర్ గ్రిడ్ ద్వారా ప్రతిఇంటికీ కుళాయి ఇచ్చి, సురక్షితమైన తాగునీరు అందిస్తామన్నారు. చెరువుల నుంచి రైతులు పొలాలకు ఉచితంగా మట్టితోలుకునే హక్కు కల్పిస్తామని చెప్పారు. తీరప్రాంత ప్రజలు ఉచితంగా పెన్నానది నుంచి ఇసుక తెచ్చుకునే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. వైసిపి పాలనంలో రాష్ట్రంలోని ప్రజల ఆస్తులు, మాన, ప్రాణాలకురక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి గూండాల పెట్రేగిపోతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. వైసిపి రౌడీ మూకలను ఉక్కుపాదంతో అణిచివేస్తామన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే సిపి రోడ్డు నుంచి కొత్తచెరువు, జోగిరెడ్డిగారిపల్లె, తిప్పనపల్లె వెళ్లే రోడ్డు పనులను పూర్తి చేస్తామన్నారు. బ్రహ్మంసాగర్ కుడికాల్వ పనులను పూర్తి చేసి సాగునీటి కష్టాలు తీరుస్తామన్నారు.మీ కోసం పనిచేసే చంద్రన్నను సిఎం చేసేందుకు మీవంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల చెంగల రాయుడు

విద్యుత్ కోతలు, నియంత్రణ లేని ధరలు

జగన్ పాలనలో ప్రజలకు కరెంట్ షాక్

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు

ప్రజాశక్తి- రాజంపేట అర్బన్

జగన్ పాలనలో ప్రజలకు కరెంటు షాక్ కొడుతోందని, నిత్యం అప్రకటిత విద్యుత్ కోతలతో పాటు ఈ నాలుగేళ్లలో ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి వైసిపి ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు విమర్శించారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి హయాంలో ఆంధ్రప్రదేశ్‌ను లోటు నుంచి మిగులు విద్యుత్‌ను రాష్ట్రంగా చంద్రబాబు నాయుడు మార్చారని, ప్రస్తుతం 2022 నుంచి విద్యుత్ లోటు కనిపిస్తోందని, విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వై.ఎస్. అవినాష్ రెడ్డికి చెందిన షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ కంపెనీ నుంచి నాసిరకం విద్యుత్తు పరికరాలు కొనుగోలు చేయడం వల్ల విద్యుత్ సమస్యలు నెలకొంటున్నాయని అన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రంలో సామర్థ్యానికి తగ్గట్టుగా విద్యుత్ ఉత్పత్తిని చేయకుండా, విద్యుత్తు సంస్థలతో చేసుకున్న ఒప్పందాల ప్రకారం సౌర విద్యుత్తు కొనుగోలు చేయకుండా కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్లో ప్రయివేట్ కంపెనీల నుంచి అధిక ధరలకు విద్యుత్తు కొనుగోలు చేసి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తామని హామీ ఇచ్చిన జగన్ రెడ్డి అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. విద్యుత్తు కోతలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తక్కువ ఓల్టేజీ విద్యుత్ సరఫరా కారణంగా చేనేత కార్మికులు, ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. డిస్కంలు ఎదుర్కొంటున్న ఆర్థిక లోటును పూడ్చుడానికి జగన్ సర్కార్ ప్రజలపై భారం మోపుతూనే ఉందని., విద్యుత్తు ఛార్జీల పెంపు కారణంగా రూ 1.47 కోట్ల కుటుంబాలపై భారం పడుతుందని తెలిపారు. ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందిస్తామని జగన్ హామీ ఇచ్చారని, నేడు మాట తప్పి, మడమతిప్పి కేవలం ఎస్సీ-ఎస్టీ కాలనీలకు మాత్రమే పరిమితం చేసి కాలనీలకు దూరంగా ఉన్న ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేశారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం మిగులు విద్యుత్తు రాష్ట్రాల సరసన ఉండేదని, 2022లో మొదటిసారిగా పవర్ హాలిడే ప్రకటించిన ఘనత జగన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 26 జిల్లాలలో ట్రూ-అప్ ఛార్జీల పేరుతో ప్రభుత్వం రూ 3,669 కోట్ల భారాన్ని 1.47 కోట్ల కుటుంబాలపైన., 14.65 లక్షల వాణిజ్య, 1.63 లక్షల పారిశ్రామిక విద్యుత్తు కనెక్షన్ల పై మోపారని తెలిపారు. కనీసం ప్రజలకు తక్కువ ధరతో కోతలు లేని నాణ్యమైన విద్యుత్తును అందించాలని, లేదంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, కౌన్సిలర్ తుపాకుల అశోక్, వెంకటేశ్వర్లు నాయుడు, పట్టణ కార్యదర్శి అబూబకర్, మిరియాల జ్యోతి, గుగ్గిళ్ళ చంద్రమౌళి, రామ్ నగర్ నరసింహ, జడ శివ పాల్గొన్నారు.

జనసేనలో 50 మంది చేరిక

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట జనసేన నాయకుల సమక్షంలో ఆదివారం కే.బోయిన పల్లె, కూచివారిపల్లె, సాతపల్లె ప్రాంతాల నుంచి సుమారు 50 మందికి పైగా జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాజంపేట జనసేన నాయకులు కోలాటం హరి, బాల సాయి, లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కత్తి సుబ్బరాయుడు, పోలిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో యువత పార్టీలో చేరారు. వారిని జనసేన నాయకులు కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జనసేన తీర్థం పుచ్చుకున్న యువత మాట్లాడుతూ పార్టీ భావజాలం నచ్చి తాము జనసేనలోకి వచ్చామన్నారు. నిస్వార్థంగా ప్రజలకు సేవలందించే నాయకుడు పవన్ కళ్యాణ్ అని, ఆయన ఆశయాలను అనుసరించి తాము వ్యవహరిస్తామని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చౌడయ్య, మని, గౌతమ్ పాల్గొన్నారు.

కండువా కప్పుకొని పార్టీలో చేరిన యువత

జనజాగృతి సభను జయప్రదం చేయాలి

- ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ

ప్రజాశక్తి - రాయచోటి

ఎంఆర్‌పిఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాని పురస్కరించుకొని విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జులై 7న జరపతలపెట్టిన సభను విజయంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పేర్కొన్నారు .ఆదివారం ఎన్‌జిఒహోమ్‌లో ఎంఆర్‌పిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కో-కన్వీనర్ సలవ రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో దేశంలో ఉండబడిన అన్ని ప్రాంతీయ జాతీయ రాజకీయ పార్టీలు మాదిగలను నమ్మించి మోసం చేస్తున్నాయాని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ జరిగితేనే ఎస్సీ లోని 59 ఉప కులాలకు సమన్యాయం సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు.1994లో ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం 1999లో వర్గీకరణ సాదించుకోగా దాని ఫలితంగా 22500 ల ఉద్యోగాలతో పాటు వేల సంఖ్యలో ఉన్నత చదువులకు అవకాశం లభించిందిని రాజకీయంగా సమన్యాయం జరిగిందిన్నారు. కొ న్ని అనివార్య కారణాల వల్ల 2004 సుప్రీం కోర్టు వర్గీకరణను రద్దు చేసిందన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత 29 స్థానాలు కేటాయించగా అందులో 21 మాలలకు 8 మాత్రమే మాదిగలకు ఇచ్చారన్నారు. అందుకోసమే రాష్ట్ర వ్యాప్తపర్యటన అనంతరం జిల్లా కన్వీనర్ ఎ. శ్రీనివాసులు, కో కన్వీనర్లుగా ఎ.అశోక్ కుమార్ ఎన్నుకున్నారు.

దెబ్బతిన్న అరటిపంటను పరిశీలిస్తున్న ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి

ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

మండల పరిధిలోని ఆకేపాడు గ్రామపంచాయతీలో ఈదురు గాలులకు దాదాపు రెండు వందల ఎకరాల అరటితోటలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి రైతులతో కలిసి పడిపోయిన అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వెంటనే రైతు భరోసా కేంద్రంలో పంట నష్టం నమోదు చేసుకోవాలని సూచించారు. అక్కడ నుంచే ఫోన్ ద్వారా రెవెన్యూ అధికారులకు పంటనష్టం గురించి తెలిపారు. రైతులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నష్టపోయిన రైతులకు అండగా భరోసానిస్తారని తెలిపారు. నష్టపోయిన రైతులకు ఆర్థికసాయం అందించడంలో జగనన్న ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చెంచురెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, అంజిరెడ్డి, పాపిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వివేక్ ప్రసాద్, విఆర్ఓ నరసింహులు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక హేమావారి కళ్యాణమండపంలో నియోజకవర్గ తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ సనావుల్లా వివాహం వైభవంగా జరిగింది. ఈ వివాహానికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచ్ రెడ్డివారి ప్రకాష్‌కుమార్ రెడ్డి తో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మాజీ ఎంపిపి నాగభూషణంరెడ్డి, మాజీ ఎంపిటిసి జనార్ధన్ గౌడ్, నాయకులు రవి, మధురెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



సనావుల్లా వివాహానికి హాజరైన నల్లారి కిషోర్‌రెడ్డి

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో గత 15 రోజులుగా క్రికెట్ టోర్నమెంట్ స్వర్గీయ మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతుంది. ఆదివారం పోటీలు చివరి దశకు చేరుకోవడంతో గెలుపొందిన జట్టుకు నగదు బహుమతులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. సీనియర్ జట్టులో విజేత నిలిచిన ఈశ్వర్ లెవెన్ జట్టు రూ.30,116లు, రన్నర్స్ అరేపల్లి జట్టుకు రూ.15,116, అండర్-18 విభాగంలో విజేత నిలిచిన ఆర్‌పి పల్లి జట్టుకు రూ.10,116లు, రన్నర్స్ రెడ్డెల కొండ జట్టుకు రూ.5,116 లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గంలో నడవ కుండా చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు శరీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడుతాయని అన్నారు. నాగిరెడ్డి ట్రస్ట్ తరుపున క్రికెట్ టోర్నమెంటు నిర్వహణ చేపడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, రాంప్రసాద్ తనయుడు నిచ్చల్ రెడ్డి పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

జూనియర్ కళాశాల ప్రారంభించాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించాలని గతంలో అధికారులు ఆదేశాలు జారీ చేసినా, అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు వల్ల చుట్టుపక్కల గ్రామాల పేద విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. గతేడాది ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించాలని అధికారులు ఆదేశాలిచ్చినా అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు స్పందించి జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కలివేల రాజశేఖర్, ఎర్రంపల్లి అజయ్, నాయకులు అరవింద్, దేవకుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని దొంతమ్మ రోడ్డులో ఆదివారం సిఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ తనిఖీ చేశారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

బిజెపి, వైసిపి ప్రభుత్వాలకు రోజులు దగ్గర పడ్డాయి

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

వేంపల్లె : బిజెపి, వైసిపి ప్రభుత్వాలకు రోజులు దగ్గర పడ్డాయని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొంగ నాటకాలు ఆడుతూ ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తున్నాయని ఆదివారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో తెలిపారు. హస్తినలో దోస్తీ, ఆంధ్రలో కుస్తీ, ఢిల్లీలో సై, రాష్ట్రంలో నై అన్నట్లుందని ఎద్దేవా చేశారు. నేను కొట్టినట్లు నటిస్తా, నీవు ఏడిచినట్లు నటించు అన్నట్లుంది వారి పరిస్థితి అని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మళ్లిస్తోందని, రాష్ట్రంలో శాంతి కరువైందని అన్నారు. దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని శ్రీకాళహస్తిలో జరిగిన బిజెపి సమావేశంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా వ్యాఖ్యానించడం అక్షరాల వాస్తవమన్నారు. కేంద్ర నిధులను రాష్ట్రం మళ్లిస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఏమి చేస్తోందని ఆయన ప్రశ్నించారు. ప్రత్యేకహోదా పంగనామాలు పెట్టి చట్టంలోని అనేక అంశాలకు నష్ట పరిచి, రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం తీరని నమ్మక ద్రోహం చేసిందని చెప్పారు.

పంపిణీకి సిద్ధంగా జగనన్నవిద్యా కానుక కిట్లు

చాపాడు : 2023-24విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పూర్తిస్థాయిలో పాఠశాలలకు సరఫరా చేసినట్లు ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. సోమవారం పాఠశాలలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 61 పాఠశాలలకుగాను 3,384 విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బూట్లు, సాక్స్, బ్యాగ్, యూనిఫామ్స్, బెల్ట్, పుస్తకాలు అన్ని పాఠశాలలకు అందజేస్తామన్నారు. ఆదివారం పాఠశాలలకు సరఫరా చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం జగనాయి అరటి మొక్కలు, డిఎన్ఆర్ యువసేన వారి సౌజన్యంతో ఎక్సెలెంట్ ఇన్స్టిట్యూట్, నాగార్జున పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన ఈ ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు చిట్టి, శిల్పారామం అధికారి సుధాకర్, నాగార్జున పాఠశాల కరస్పాండెంట్ గీత పాల్గొన్నారు.

టమోటాకు సూదిపురుగు తెగులు

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-కలికిరి

టమోటాలో సూదిపురుగు తెగుళ్లతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని పుట్టపాలెం, మేడికుర్తి, మహల్, గుండ్లూరు పంచాయతీలలో అధికంగా రైతులు టమోటా పంటను పండిస్తున్నారు. అయితే టమోటాకు సూదిపురుగు తెగులు ఆశించడంతో పంట దిగుబడి బాగా తగ్గిపోతుందని, మార్కెటింగ్‌కు కూడా పనిరాకుండా పోతున్నాయని రైతులు లబోదిబో మంటున్నారు. ఈ పురుగు ఆకుల లోపలి భాగంలో సొరంగాలు చేసుకుని జీవించడం వలన కేవలం పురుగుమందుల ద్వారా మాత్రమే ఈ పురుగును నివారించడం కష్టం. సమగ్ర యాజమాన్య పద్ధతులను రైతులు తప్పనిసరిగా పాటించాలి. పురుగు ఆశించని, ఆరోగ్యవంతమైన నారు మొక్కలను నాటుకోవాలి. నాటిన 15 నుంచి 20 రోజు లపుడు వేపనూనె 5మి.లీ /లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. దీనికి కొద్ది మొత్తంలో సర్ఫ్ పొడి (1గ్రాము/లీటరు నీటికి) కూడా కలపాలి. 10 రోజుల వ్యవధి తర్వాత మరొకసారి వేపనూనె పిచికారి చేయాలి. పంట నాటిన 20 నుంచి 25 రోజులపుడు మగ రెక్కల పురుగులను ఆకర్షించే లింగాకర్షక బుట్టలు ఎకరాకు 10 చొప్పున ఏర్పాటు చేయడం ద్వారా పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. పురుగును గమనించినపుడు క్లోరాన్ట్రలిప్రోల్ 0.3మి.లీ లేదా సయాన్ట్రలిప్రోల్ 0.3మి.లీ లేదా ఫ్లూబెండమైడ్ 0.3మి.లీ లేదా ఇండాక్సాకార్బ్ 0.5మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

టమోటా పంట

టమోటాకు సోకిన సూదిపురుగు తెగులు

యాజమాన్య పద్ధతులు పాటించాలి

యాజమాన్య పద్ధతులతో తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చు. నిలకడలేని ధరలను దృష్టిలో ఉంచుకుని రైతులు ఖర్చు తగ్గించుకునేందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలి. పంట వేసినప్పటి నుంచి కాయ కోత వరకు అన్ని దశలలోనూ ఈ పురుగు ఆశిస్తుంది. లద్దెపురుగులు ఆకులపై ఆకుపచ్చని పదార్థాన్ని తినివేసి, ఆకు పైభాగాన్ని పలుచటి పొరలాగా చేసుకుని, లోపల ఉండి తింటాయి. దీనివలన పురుగు చేసే నష్టాన్ని రైతులు చాలా ఆలస్యంగా గుర్తిస్తున్నారు. ఇవి ఆకులనేగాక పూమొగ్గలు, కాయలపై కూడా ఆశించి నష్టాన్ని కల్గిస్తాయి. పురుగు ఆశించిన కాయలపై సన్నటి రంధ్రాలు ఏర్పడి మార్కెటింగ్ కు పనికిరావు. ఇది టమోటానే గాక వంగ, ఆలుగడ్డ పంటలను కూడా ఆశించి నష్ట పరుస్తుంది.

-డాక్టర్ పాండురంగ, కెవికె కో-ఆర్డినేటర్

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి-కలకడ

వేసవి విజ్ఞాన శిబిరం ముగిశాయని కలకడ మండల శాఖ గ్రంధాలయ అధికారి అమరనాథ తెలిపారు. మండల కేంద్ర మైన కలకడ మండల శాఖ గ్రంధాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం పాటలు పాడించడం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గతంలో వివిధ రకాల ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు బహుకరించినట్లు తెలిపారు. విజ్ఞాన శిబిరంతో విద్యార్థులలో తెలివితేటలతో పాటు ఆటలతో పట్ల విద్య పట్ల మక్కువ పెంచేందుకు అవకాశం ఏర్పడిందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి :** గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన దేవాలయాలని ఎస్ఐ రహీముల్లా అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం గ్రంథాలయ అధికారి విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు గ్రంథాలయాలపై ఇష్టం పెంచుకోవాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి గ్రంథాలయాలు ఎంతో దోహద పడుతాయని అన్నారు. విఆర్ఓ నరేంద్రరెడ్డి విద్యార్థులు గ్రంథాలయాలలో విధిగా పుస్తక పఠనం అలవర చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది రెడ్డప్ప పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మదనపల్లె శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిదులుగా బిటి.కళాశాల కరస్పాండెంట్ మునిరత్నం, ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విజ్ఞాన సంపత్తిని పెంచుకొని విద్యార్థులు అభివృద్ధి బాటలో ఎలా పయనించవచ్చో సోదాహరంగా వివరించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించిన రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ కే. సహదేవరావు, విశ్రాంత ఉపాధ్యాయులు, కళాకారులైన సర్వ శ్రీ రెడ్డప్ప, మదన మోహన్, ప్రసాద్ శర్మ, దీక్ష ప్రిన్సిపాల్ నాగార్జున. రమణమ్మ, మణి, భాను ప్రకాష్, చిత్ర లేఖన ఉపాధ్యాయులు వి.ఎం.నాగరాజ, శిరీష, కథ నవలా రచయిత టిఎస్ఎ.కృష్ణమూర్తి, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, మిమిక్రీ కళాకారులు హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి, వివేకానంద ఫౌండేషన్ భాను ప్రకాష్ లను గ్రంథాలయ అధికారిణి వసంత కుమారి, గ్రంథాలయ సిబ్బంది జయమ్మ తదితరులతో కలసి ఘనంగా సన్మానించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో ఆంగ్ల తెలుగు భాషలలో వ్యాకరణం, వాక్య నిర్మాణం, చిత్రలేఖనంలో, పఠనంలో, కథలు చెప్పడంలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేసి ప్రశంసా పత్రాలు అందించారు. **గాలివీడు:** వేసవి శిక్షణ ముగింపు కార్యాక్రమంలో మిట్టపల్లి గోపికృష్ణారెడ్డి పాల్గొని వ్యాసరచన, వకృత్వ పోటీలు, డ్రాయింగ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రామచంద్రనాయక్ విద్యార్థులు పాల్గొన్నారు. **కురబలకోట:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపిపి దస్తగిరి అన్నారు. 35 రోజుల సమ్మర్ క్యాంప్ లో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ చిత్రలేఖన, పెయింటింగ్, క్రాఫ్ట్, డ్రామా, పాటలు నిర్వహించడం జరిగిందని అన్నారు. పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాతమ్మ, గ్రంథాయ అధికారి చంద్రశేఖర్ నాయక్ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక గ్రంథాలయంలో మే 8వ తేదీ నుంచి ఈనెల 11వ తేదీ వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనారు మధుబాల ఆదేశాల మేరకు నిర్వహించిన వేసవి శిక్షణశిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాల్లో ప్రావీణ్యాన్ని కనబరచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రధానో పాధ్యాయులు జె.కృష్ణప్ప చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటకుమార్ పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో మే 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం అట్టహాసంగా ముగించడం జరిగిందని గ్రంథాలయ నిర్వహణ అధికారి జయప్రకాష్ తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులు అందరికీ గ్రంథాలయాలలో సభ్యత్వం తీసుకోవాలని, పిల్లల తల్లిదండ్రుల ద్వారా కూడా సభ్యత్వం తీసుకుంటే గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను విరామ సమయంలో ఇంటి వద్దకు తీసుకెళ్లి చదువుకొనుటకు వీలవుతుందన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాష్‌రాజు, వెంకటరమణ, రెహమాన్, గ్రామ సభ్యులు మనోహర్‌రెడ్డి, నూకల శివ, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కలకడ : ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఎస్ఐని సన్మానిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ములకలచెరువు

నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గూడుపల్లి, కాలువపల్లె గ్రామ పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఒటిఎస్ స్కీం ద్వారా రూ.10వేలు చెల్లించిన లబ్ధిదారులకు ములకలచెరువు సచివాలయంలో ఒటిఎస్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తోందన్నారు. అనంతరం గూడుపల్లె, కాలువపల్లె గ్రామాల్లో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరానికి చర్యలు చేపట్టారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ అశ్వని, ఎంపిపి సాయిలీలా, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచులు రెడ్డెప్ప, రహ్మతి, జయచంద్రకుమార్, రాంబాబు, మాజీ సర్పంచి రవీంద్రారెడ్డి, నాయకులు రవిశేఖర్రెడ్డి, కేశవరెడ్డి, మల్లికార్జునరెడ్డి, సుదర్శన్రెడ్డి, మదుసూదన్రెడ్డి, విశ్వనాథ్, చాంద్ బాషా పాల్గొన్నారు.

ఒటిఎస్ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

అన్ని రంగాలలో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు

విజేత ట్రోఫీని అందుకుంటున్న రైజింగ్ స్టార్స్ జట్టు సభ్యులు

ప్రజాశక్తి-నందలూరు

నేటి యువత విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, ఐకెపిఎస్ అధ్యక్షుడు పోతురాజు మస్తానయ్య, మాజీ వార్డ్ మెంబర్ తోట శివశంకర్‌లు అన్నారు. స్థానిక అరవపల్లి లోని జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో కుమ్మర పల్లె యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ లో విజేతగా అరవపల్లికి చెందిన రైజింగ్ స్టార్స్ జట్టు ట్రోఫీని కైవసం చేసుకుంది. ఆదివారం ఉదయం ప్రారంభమైన తుది పోరులో మొదటగా బ్యాటింగ్ చేసిన రైజింగ్ స్టార్స్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 164 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన నాని జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 104 పరుగులు మాత్రమే సాధించి రన్నర్స్ జట్టుగా నిలిచారు. ఈ క్రికెట్ పోటీలలో ప్రథమ బహుమతిగా 30 వేల రూపాయలు తో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతిగా 20వేల నగదు తో పాటు ట్రోఫీని ఆంధ్రప్రదేశ్ విశ్రాంత సీఈవో యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో శివరామరాజు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ నందలూరు మండలం విద్యలోనే కాకుండా అన్ని రంగాలలో గుర్తింపు పొందిందని అన్నారు. ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుండే తమకు మక్కువ, ఆసక్తిగల రంగాలలో రాణిస్తేనే వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకో వచ్చునన్నారు. ఈ క్రికెట్ పోటీలకు పలువురు దాతల సహకారంతో విజయ వంతంగా ముగిసిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి శ్రీరాములు, కార్యనిర్వాహకులు ఆకుల వెంకటేష్ (టిల్లు), రంజిత్, దీపు మధు పల్లె గ్రీష్మంత్ రెడ్డి శివకోటి, మున్నా, ప్రవీణ్, రామయ్య, లోకేష్, సునీల్, గౌతమ్ పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పేరుతో బాదుడు తగదు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యుత్ ఛార్జీల పేరుతో బాదుడు తగదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వీరనాల శివనారాయణ తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలు, సామాన్యులపై మోయలేని భారంగా విద్యుత్ ఛార్జీలున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పేరుతో పెద్ద ఎత్తున భారాలు మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే విద్యుత్ భారాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జూన్ నెలలో విడుదల చేసిన కరెంటు బిల్లుల ద్వారా సామాన్య ప్రజానీకం ఉక్కిరిబిక్కిరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని సిపిఎం అనేకసార్లు ప్రభుత్వాన్ని కోరినా ఫలితంలేదన్నారు. ప్రస్తుత బిల్లులో ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ట్రూ అప్ ఛార్జీలు వంటి రకరకాల పేరుతో అదనపు భారం వేశారన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు శ్రీను, సంజీవ రాయుడు, మునికుమార్, గొర్రె కృష్ణ పాల్గొన్నారు. **వేంపల్లె :** వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచడమే కాకుండా మరోమారు సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై వేల కోట్ల భారాన్ని మోపడం సరికాదని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్దుబాటు పేరుతో రెండు నెలలకు ఒకసారి పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే విరమించాలని డిమాండ్ చేశారు. నవరత్నాల పేరుతో సంక్షేమం అందిస్తామన్న జగన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో తొమ్మిది విడతలుగా విద్యుత్ ఛార్జీలు పెంచడం హేయమైన చర్య అన్నారు. చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఏనాడూ విద్యుత్ ఛార్జీలు పెంచకపోగా నాణ్యమైన విద్యుత్‌ను అందించారన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీల భారంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులను పడుతున్నారని అన్నారు. పెంచిన ఛార్జీలను తగ్గించక పోతే త్వరలోనే ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడుతారని అన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో గోగుల మల్లికార్జున, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రామచంద్రారెడ్డి

'మానవత' కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-చిన్నమండెం

మానవతా సంస్థ సొంత కార్యాలయ సొంత భవనం, శాంతి రథాన్ని సంస్థ వ్యవస్థాపకులు ఎన్. రామ చంద్రారెడ్డి ఆదివార ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా సంస్థ విలువలతో కూడుకున్నదని, కులమత బేధాలకు అతీతంగా నడుచుకుంటుందని పేర్కొన్నారు. కడప నుంచి ఈ కార్యక్రమానికి సెంట్రల్ కమిటీ డైరెక్టర్స్ సహదేవరెడ్డి, రాటాల గోపి, రామానుజుల రెడ్డి, డాక్టర్ సి.సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, అచ్చేలు ప్రసాద్‌రెడ్డి, రాయచోటి నుంచి శివ గంగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, గాలివీడు నుంచి సుబ్బిరెడ్డి, శివారెడ్డి, ప్రస్తుత అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు. చిన్నమండెం చైర్మన్ జయచంద్రారెడ్డి, గౌరవ డైరెక్టర్ రెడ్డప్పరెడ్డి, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొని కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

గాలివీడు : గ్రామంలో నివాసం ఉన్న ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి సక్రమంగా ఇంటి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని గ్రామ సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి పేర్కొన్నారు. పారిశుధ్యం, వీధి దీపాలు, గ్రామాల్లో మౌళిక వసతులకు నిధులను వెచ్చించి అభివృద్ధి చేస్తామన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కురబలకోట

తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌ను టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తెట్టు రెడ్డిశేఖర్, టిడిపి నాయకులు కుప్పంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసి తన విజయానికి కృషి చేసిన నాయకులకు, ఓటర్లకు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఎప్పుడు రుణపడి ఉంటానని అన్నారు. రానున్న రోజుల్లో తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలో పర్యటించ నున్నట్లు వెల్లడించారు. ఎల్లవేళలా అందరికి అందుబాటులో ఉంటానని అన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని చెప్పారని అన్నారు. కార్యక్రమంలో పి.ఎస్.మునిరత్నం, రమణ, బాలాజీ, ఇర్షాద్, జీవరత్నం, పూజరివారిపల్లె చంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 6వ తరగతి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎపిమోడల్ స్కూల్లో ఆరో తరగతి ప్రవేశం కొరకు ఆదివారం లక్కిరెడ్డిపల్లె ఎపిమోడల్ స్కూల్లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష 87 మంది గాను 85 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాన్ని ఎంఇఒ చక్రానాయక్, ఎస్ఐ మల్లికార్జున రెడ్డిలు పరీక్ష కేంద్రాన్ని తనిఖీలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు తాగునీరు, అన్ని సదుపాయాలుతో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణ పరిధిలోని పెద్దూరులో ఉన్నటువంటి బ్రాహ్మణ వీధి ఆలయాలు పునర్నిర్మాణం కొరకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో రుషి రమేష్, హరివీరారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ

లోకేష్ పాదయాత్రకు సంఘీభావం

వేంపల్లె : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేస్తున్న పాదయాత్రకు వేంపల్లె టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. ఆదివారం బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు క్రాస్ నుండి బద్వేలు వరకు లోకేష్‌తో కలిసి టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, పివి రమణ, గోటూరు నాగభూషణం, దొంతు సుమన్, కృష్ణారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పట్టేం అశోక్, పలువురు పాదయాత్రలో పాల్గొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో పాదయాత్ర ముగింపు ఉండడంతో సంఘీభావం తెలిపేందుకు వెళ్లినట్లు మహమ్మద్ షబ్బీర్ తెలిపారు.

క్రైం కార్నర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలో ఈనెల 9 వ తేదిన మహిళను హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి కేశప్ప తెలిపారు . ఆదివారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం, కోలార్ జిల్లా, ములభాగల తాలూకు, రాజేంద్రనహళ్లి పోస్టు, చికూరు గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి ఇతని భార్య అక్కగాళ్ల లక్ష్మీదేవమ్మలు కొన్ని సంవత్సరాల క్రితం జీవన ఉపాధికై రామసముద్రం మండలం, కెసిపల్లి పంచాయతీ ప్రకాష్‌రెడ్డి కులాల వద్ద కాపులాదారులుగా ఉంటున్నారు. అయితే వీరి కుమార్తె ధనలక్ష్మిని చౌడేపల్లి మండలం, గడ్డంవారిపల్లి కి చెందిన రెడ్డప్పకు ఇచ్చి వివాహం చేశారు. ఐదు సంవత్సరాల క్రితం రెడ్డప్ప అనారోగ్యంతో మృతి చెందడంతో ధనలక్ష్మి అంగన్వాడీ వర్కర్‌గా పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో రామసముద్రం మండలం, అరికెల పంచాయితీ, గోసువారి పల్లికి చెందిన సుబ్రమణ్యంరెడ్డి కుమారుడు మల్లకుంట్ల అంజనీకుమార్‌రెడ్డికి శంకర్‌రెడ్డి కుమార్తె ధనలక్ష్మి కి ఫేస్ బుక్ ద్వారా పరిచయమై ఆ పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకుంటానని నమ్మించి కొన్ని రోజులుగా సహజీవనం సాగించాడు. నగ్నంగా వున్న విడియోలు తీసి ధనలక్ష్మి తల్లిదండ్రులకు చూపించి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగిందని తెలిపారు. నగ్నంగా వున్న వీడియోలను సామాజిక మాధ్యమాలలో పెట్టడంతో గతంలో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇతనిపై చౌడేపల్లి పోలీస్ స్టేషన్లో నాలుగు సార్లు కేసు నమోదు చేసి రిమాండ్ కూడా తరలించినట్లు తెలిపారు. జైలు నుంచి వచ్చిన తర్వాత ఇదంతా ధనలక్ష్మి తల్లిదండ్రులు చేస్తున్నారని కక్షగట్టి ఈనెల 9 వ తేదిన శంకర్‌రెడ్డి ని హత్య చేయాలని నిర్ణయించుకుని కత్తి తీసుకుని వచ్చాడు. అక్కడ శంకర్‌రెడ్డి లేక పోవడంతో లక్ష్మీదేవి గొంతు కొసి హత్య చేసి పరారైయ్యాడు. కుమార్తె గువ్వల ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఆదివారం పుంగనూరు అంబేద్కర్‌సర్కిల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అంజనీకుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎస్‌పి గంగాధర్‌రావు ఆదేశాల మేరకు హత్య జరిగిన 24 గంటల్లోనే రూరల్ సర్కిల్ సిఐ శివాంజనేయులు, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది కేసును చేదించడం జరిగిందని తెలిపారు.